# నాన్న చీకటి

–కనక ప్రసాద్, **Gainesville, FL**

నాన్నకి చిత్రమైన అలవాటు. ఒక్కళ్ళే అలా చీకట్లో కూర్చుంటారు. ఒక్కోసారి నేను ఆలస్యంగా ఇంటికొస్తాను. ఇల్లంతా చీకటిగా ఉంటుంది. నెమ్మదిగా చప్పుడు కాకుండా లోపలికెళ్తాను. అమ్మ పాపం అలిసిపోయి పడుకుని ఉంటుంది. అసలే దానికి ఓ పట్టాన నిద్ర పట్టదు. మెత్తగా అడుగులేసుకుంటూ వెళ్ళి, లుంగీలోకి మారి వంటింట్లోకి మంచినీళ్ళకోసం వెళ్తాను. వంటింట్లోకి అడుగేసి ఫ్రిజ్ దగ్గరికి వెళ్ళబోతే నాన్న కుర్చీని తన్నుకుని బోర్లా పడ్డంత పనవుతుంది. ఆయన వంటింట్లో చీకట్లో కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నారు.

'నాన్నా?'

'పెద్దా?!...'

'వెళ్ళి పడుకోకూడదూ...?'

'ఊఁ...'

కానీ ఆయన పడుకోడానికి వెళ్ళరు. అందరూ పడుకున్న చాలా సేపటికీ ఆయనింకా అక్కడే పడక్కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తూ ఉంటారు.

మామూలప్పుడు నేను గదిలో కూర్చుని ఏదో చదువుతూంటాను. మా అమ్మ పెరుగు తోడుకోసం పాలు కాచి చల్లారబెడుతుంటుంది. శీను గాడు మేడమీద పడుకోడానికెళ్తాడు. మా చెల్లి హాల్లో టీవి చూసి చూసి తనూ పడుకోడానికెళ్తుంది. ఇంకా సేపటికి మా అమ్మా వంటింటి లైటార్పేసి 'శరణు దశరథరామా సకల జీవుల రక్షకా... ఆర్త త్రాణ పరాయణా... అనాధ రక్షకా.. శరణం శరణం శరణం...' అని వల్లించుకుంటూ పడుకోడానికి లేస్తుంది. ఇంకా సేపటికి పదిన్నరా. ఇలాగ నేను మంచీళ్ళకి లేస్తాను. (నాకు మాట్లాడితే దాహం వేస్తుంది.) వంటింట్లోకి మంచినీళ్ళకి వెళ్ళబోయి మళ్ళీ నాన్న కుర్చీని గుద్దుకుని పడ్డంత పనవుతుంది. నేను శలవులకని ఇంటికొస్తే ఈయనిలా చీకట్లో కూర్చుంటారని నేను కల కాసేనా? నాకు ఈ సంగతి మొదట్లో పట్టింపుండేది కాదు. నాన్న మాత్రం రోజూ రాత్రుళ్ళు అక్కడే చీకట్లో శిలా విగ్రహంలాగ... సిగరెట్లు కాల్చుకుంటూ, ఏదో ఆలోచించుకుంటూ.

'ఏటి నాన్నా? పడుకోడానికెళ్ళరా...?'

'ఎల్తాను పెద్దా...'

అనడం అంటారు గాని అక్కడ్నించి వెళ్ళరు. అలా కూర్చుని చీకట్లోకి పరధ్యానంగా చూస్తూ. నాకు బేజారుగా ఉంటుంది. ఏంటో అర్థం కాదు. ఈయన దేని గురించి ఇంత లెక్కన ఆలోచిస్తూ ఉంటాడు? ఒసారి అదే అడిగేను–

'ఏంటి నాన్నా అంత ఆలోచన? ఏటీ?...'

'ఏటీ లేదురా...!'

ఇంక చికాకేసి ఆయన్ని అలాగే వొదిలేసి పడుకోడాని కెళ్ళిపోయాను. నాకు ఎంత సేపటికీ నిద్దర్రాలేదు. దాహం వేసింది. అదిగో. ఆయనక్కడే ఉన్నారు. పేకట్లో సిగరెట్లు అయిపోయేయి కాబోలు. తనుమాత్రం చీకట్లో మడత కుర్చీలో అలాగే కూర్చున్నారు. రెండ్నిమిషాలకి నాకు చీకటి అలవాటైపోయింది. లైటెయ్యకుండానే ఫ్రిజ్ తీసి మంచినీళ్ళు వొంపుకున్నాను. ఆయన్ని దగ్గరసా చూస్తే అలా కళ్ళు తెరుచుకుని గాల్లోకి చూస్తున్నారు. కళ్ళు రెప్పన్నా వెయ్యకుండా. అసలు నేనక్కడికి వచ్చినట్టు ఆయనకి స్పృహ లేదు. నాకు భయం వేసింది. కొంచె గట్టిగానే

'ఏంటి నాన్నా? పడుకోడానికెళ్ళరా...?' అన్నాను.

'ఎల్తాను గోపీ? నువ్వెళ్ళు... ఊఁ...'

'అది కాదు... ఏటలాగ ఒక్కళ్ళే చీకట్లో కూర్చుంటారు. ఎంతకని...? ఊఁ...? ఏంటి దేనిగురించి వర్రీ అవుతున్నారు?'

'ఏం లేదు పెద్దా!... ఏటీ లేదూ... రెస్టుకోసం... అంతే!'

ఆయన చెప్పే పద్ధతి చూస్తే నమ్మాలనే అనిపించింది. ఆయన గొంతులో వర్రీ, దుఃఖం ఏమి లేవు. మడత కుర్చీలో అలాగ్గంటలు గంటలు చీకట్లో జీబు జీబుమని... రెస్టేటి రెట్టు?

ఏమై ఉంటుంది?

డబ్బులకోసం కాదు. మాకు డబ్బుకి ఇబ్బంది లేదు. ఆయన హెల్త్ గురించీ కాదు. ఇంట్లో అందరికీ ఒంట్లో బాగానే ఉంది. ఇంక ఏం ఆలోచనో నాకు తోచలేదు. కాని ఏదో చెప్పలేని దిగులు పట్టుకుంది. అలా మొహంలోన ఏ ఫీలింగ్ లేకుండా ప్రశాంతంగా కూర్చుంటారు... రెస్ట్ అంట! అదేం రెస్టు...

ఆయన బుర్రలో ఏంవుందో నాకెలా తెలిసేది? అసలు దేని గురించి ఆలోచిస్తున్నారో... అసలేం ప్రోబ్లెమ్ లేదేమో. ఆయన మామూలుగానే ఉన్నారు... కాని సంగతేంటో తెలీకపోతే నాకే కదా వర్రీ!

ముసిలి పిచ్చా? ఆయనకి ముసిలి పిచ్చేంటి ఇంకా ఏభైనాలుగేళ్ళు. మామూలుగా నలుగుర్లో కుర్చున్నప్పుడు నవ్వుతాలు మనిషే. మిగిలిందంతా మునుపటిలాగే ఉంది. ఇప్పటికీ ఎండలో కూర్చుని పేపరు మొహానికి అడ్డంగా పెట్టుకుని చదువుతారు, వారఫలాలు మొట్టమొదట చూస్తారు, కాంగ్రెస్ పార్టీని తిడతారు. అసలు చూడ్డానిక్కూడా ఏభైల్లో మనిషిలా అనిపించరు. వీధిలో వాళ్ళు కూడా ఆ మాటే అంటారు, 'జగ్గారావు కేటి పెళ్ళి కొడుకులాగున్నాడు.'

అది పగటిపూట. ఈ రాత్రి పూట మాత్రం ఇలాగ చీకట్లో కూర్చుని కళ్ళు రెప్పలు వెయ్యకుండా ఏ మూడో జాము దాకానో సిగరెట్లు కాల్చుకుంటూ కూర్చుంటారు. ఆయనన్నట్టు రెస్ట్ తీసుకోడానికే అయితే మంచిదే. అలాగే అని సరిపెట్టుకుంటాము. కాని ఒకవేళ ఇంకేదేనా అయితే...? అలాగ బెల్లం కొట్టిన దిమ్మలాగ కూర్చుంటారు గానీ మాటైనా మాట్లాడరేమి? ఒనవ్వా, ఓ ఏడుపూ ఏపీ లేకుండా...

అలా ఎవరికీ చెప్పకుండా మూడు రోజులు చూసేక ఇంక నాకు కోపం వచ్చింది. ఏంటో తెలీని చేతకాని తనానికి ఉడుకుమోత్తనానికి నాకు కోపం...

'ఏంటి నాన్నా? దేనిగురించి... అలాగ బాధపడుతున్నారు...?'

'ఏటిలేదు నాన్నా. ఏట్లేదన్నానా...!'

ఈసారి నేను వదల దల్చుకోలేదు. అటో ఇటో తేలుస్తాను.

'ఏటీ లేదంటారు... ఏటీ లేకపోతే ఎందుకలాగ ఒక్కళ్ళు కూర్చుని చీకట్లోని...? ఇంత రాత్రివేళ...'

'రెస్ట్ తీసుకుంటాను గోపీ! నాకిక్కడే బాగుంది...'

ఇలాగ లాభం లేదు. రేపు మళ్ళా ఈయనిక్కడే నేనక్కడే చీకట్లో రడి...

'బాగుంట్టం కాదు నాన్నా! అలాగ దేనిగురించి ఆలోచిస్తారు? ఎందుకలా ఒక్కళ్ళూ కూర్చుంటారు? ఏటి దేనిగురించి వర్రీ అవుతున్నారు... నాతోటి చెప్పకూడదా...?

'చెప్పటానికేటి లేదురా! ఏం లేదన్నానా... ఇలాగ రెస్ట్ తీసుకోడానికీ... నువ్వెళ్ళు.'

నా కోపం పోయింది. కాని నాన్న గురించి ఇంకా బెంగగానే ఉంటుంది. కాని ఈ సంగతేదో తెలిస్తే తప్ప పిచ్చెక్కేలా ఉంది. నెమ్మదిగా దగ్గరకెళ్ళి నచ్చచెప్పుతున్నట్టు అడిగేను.

'అలా కాదు నాన్నా! దేని గురించి మీరాలోచిస్తున్నారో అదే చెప్పండి... మీకి వర్రీ అనీసి నేనన్లేదు కదా... ఏంటి మనీ ప్రోబ్లెమ్మా? ఏటి హెల్తా...? ఎవరిగురించి బెంగ పెట్టుకున్నారా...?'

'ఎవరి గురించి కాదన్నానా! ఇలాగ జనరల్‌గా కుచోనుంటాను... ఫలానా దాని గురించని కాదు పెద్దా...'

బాగా రాత్రయిపోయింది. వీధిలో కుక్కలు మొరుగుతున్నాయి. ఇల్లంతా చీకటిగా నిశ్శబ్దంగా ఉంది హాల్లో వెంకట్రమణమూర్తి దగ్గర ఎలక్ట్రిక్ దీపం మెరుస్తూ మెరుస్తూ వెలిగే వెల్తురు తప్ప. నేను సెకెండ్ షో సినిమా చూసి హోటల్‌లో తిని చప్పుడు కాకుండా తాళం తీసుకుని లోపలికొచ్చేను. ఇంట్లోకెళ్ళక ముందే తెలుసు నాన్న వంటింట్లో చీకట్లో కూర్చుని ఉంటాడని.

ఆ చీకట్లోనే ఆయన నడుం వంగిన ఆకారం మరింత నల్లగా తెలుస్తోంది. అదే కుర్చీలో అలాగే కూర్చోని కళ్ళు రెప్పవెయ్యకుండా శూన్యంలోకి చూస్తున్నారు. నేను చీకట్లోనే కాసేపు నిలబడ్డాను. తరవాత మొహమాటం చంపుకుని నాన్న కుర్చీవైపు నడిచి–

'నాన్నగారూ' అన్నాను.

'గోపీ...' అన్నారు. ఆయన గొంతు లోతుగా కలలోలాగ.

నాకేసి చూడ లేదు. కుర్చీలో ఇంతైనా కదల్లేదు.

నేను ఫ్రిజ్ వైపుకి వెళ్ళబోయి మళ్ళీ కుర్చీని తన్నుకుంటానేమోనని వెళ్ళి లైటేసేను. నాన్న నిద్దట్లో పిడుగు పడ్డట్టు తుళ్ళి పడిపోయి లేచి మళ్ళా కూర్చున్నారు.

'ఏం నాన్నా ? ఉలిక్కి పడ్డారు?'

'లైటేసేవా...? లైటింగు మనకి పడదు...'

'లైటేస్తే ఏవి?'

'ఏవి లేదు. లైటింగ్ మనకి పడదు...'

నేను అసహనంగా మంచినీళ్ళు ఒంపుకుని వెంటనే లైటార్పేసేను. మళ్ళీ నాన్నకేసి తిరిగి,

'ఏట్లేదేటి నాన్నా! ఎళ్ళి పడుకోవచ్చు కదా. లేదు మీక్కావాలంటే వొచ్చి హాల్లో కుర్చోండి...'

'ఇక్కడ పెంకుటింట్లో చల్లగా బావుంటుందిరా... ఆ మిద్దింట్లో దీపాలు... లైటింగు మనకి మొదట్నించీ ఎలర్జీ...'

నాకు కొంచెం ఊరటగా అనిపించింది. నాన్న చిన్నప్పుడు వల్లరి గుడబలో కళ్ళాలకెళ్ళి రాత్రుళ్ళు నిద్దర పోయేవాడు. ఏడుగురు పిల్లల సంసారం ఈడవ లేక తాత కాశీ వెళ్లిపోతే నూర్పులకాడ మా నాన్నే నిద్దర్లు లేకుండా కాపలా కాసేవాడు. యుద్ధం రోజుల్లో బాంబింగప్పుడు జనాలందరూ విశాఖపట్నం వదిలి పట్నాలంట పారిపోతే మా నాన్న మాత్రం కరంటు పోయిన ఇరుకు సందుల్లో నడుస్తూ ఆకాశంకేసీ సముద్రంకేసీ చూసేవాడని మా నానమ్మ చెప్పే కథల జ్ఞాపకం వచ్చేయి. ఆ చీకట్లంట పెరిగిన కుర్రాడే మా నాన్న...

'ఐతే ఏటీ లేదంటారా? చీకట్లోనే మీకు బాగుంటాదా...'

'ఊ... దీపాలుంటే బుర్ర తోచదురా...'

ఇంక మాటాడకుండా గ్లాసు టేబిల్ మీద పెట్టి నా గదివైపు పోబోయేను. అంతలో జ్ఞాపకం వచ్చింది.

'పోనీ కూచుంటే కూచున్నారు... అలా కూచుని ఏటాలోచిస్తారు నాన్నా?'

'ఫలానా అని లేదు గోపీ!... ఏటీ లేదు!...'

❀❀❀❀❀❀

**మూలం: Jerome Weidman,"My father sits in the dark"**

# రూమ్

తప్పదు గనక అడ్డుపడిన
తాళాన్ని తీసేసి రూంలోకి వెళతాను
తలుపు సందులోంచి వుత్తరాలు జారిపడితే
వొంగి అందుకోవాలి
లేదా తిన్నగానే వెళ్ళచ్చు
ఈ రూంలో సజీవులూ, నిర్జీవులూ నేనూ
ఒకర్నొకరం బాగా ఎరుగుదుం గనక
తలుపులు మూసుకున్నా — మాకు
సిటీ జంక్షన్‌లో చోద్యం చూస్తున్నట్టే వుంటుంది
రూంలో ఏకాంతం, శ్మశాన నిశ్శబ్దం
ఒకప్పుడు కనిపించేవేమో!
ఇప్పుడంతా బాగానే వుంది
ఇందులోనే ఆత్మ నిగ్రహం సాధించాను
ఏకోనేకో సమః అనుకుని సాయం సృష్టించుకోవడం నేర్చుకున్నాను
(ఇందులో రూం సహకారం ఎంతైనా వుంది)
నేను సెల్కిర్క్ లాగ కిందకి దిగకుండా
రూమే నన్ను సేవ్ చేసింది
అసలు—
నేను రూంని ప్రేమించకముందే
రూమే నన్ను ప్రేమించడం నేర్చుకుంది
నా మీద రూం ప్రభావం ఎంతైనా... కాదు, ఎంతో వుంది
ఇంటికి దూరంగా వుంటున్నాను గనక
దీనికి ఉదాహరణ లివ్వగలను
ఇప్పుడు స్టేషన్ ఆవరణ
కథల్లో వినే కాశ్మీరం శాలువాలా కనిపించడం మానేసింది
రెయిళ్ళని తల్చుకుంటే
పూర్వంలా పొగనీళ్ళ కళ్ళు ఎర్రబారట్లేదు
చెప్పానుగా!
నేనీ రూంలో ఆత్మనిగ్రహం సాధించానని
నేనీ రూమ్ ఆత్మని
ఈ రూమ్ నా శరీరం
నేనెప్పుడైనా రూంలోంచి బైటకి రాబోతే - ఆ దృశ్యం
ఉబ్బిన పుట్టుమచ్చ లోంచి
వెంట్రుక బైట వస్తున్నట్టుంటుంది
ఒక్కోసారి మనం
పుస్తకం చదువుతూ చదువుతూ
చదివిన వాక్యమే మళ్ళీ చదవబోయినట్టు
నేను రూం బైటకొచ్చి — తాళం వేస్తూ వేస్తూనే
తాళం తీసి రూంలోకి వెళిపోతాను
అదేదో కథలో నక్కకీ, మొసలికీ
చెలియలి కట్టముందు చెలిమి కుదిరినట్టు
నాకూ, నా రూంకీ ఎన్నాళ్ళైనా పొసగుతుంది.

— వాసు

× "నేను విదేశాల్లో ఉన్నప్పాట్నూ– వారానికి రెండు పొడవైన ఉత్తరాలు వ్రాయమంటున్నావ్... నేనంటే నీకెంత ప్రేమ సుచీ!"
"స్టాంపులు కలెక్టు చేసుకుందామనీ."
— బుద్ధిగం పాండురంగారెడ్డి

× అమాయకురాలైన మరదల్ని దగ్గరకు లాక్కున్న బావ "నీవు ఒక్క ముద్దు ఇస్తే ఈ ప్రపంచం అంతా చూపిస్తాను" అన్నాడు.
మరదలు పిల్ల సంబరపడి వెంటనే ముద్దిచ్చేసింది.
బావ లోపలికెళ్ళి అట్లాసు తీసుకొచ్చి మరదలుకిచ్చాడు.
— బుద్ధిగం పాండురంగారెడ్డి

"నా కన్నీ మా నాన్న పోలికలే వచ్చాయంటే భయమేస్తోంది."
"అదేంటి అలాఅంటావు, ఆడ పిల్లకి తండ్రి పోలిక అదృష్టం"
"ఏం అదృష్టమో! నాన్నలా వంట చేస్తూ, పిల్లల్ని ఆడించవలసి వస్తుం దనేనా భయం."
—శిరీష